క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణాలు కాపాడండి



సామాజిక సమతా సంకల్పం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో) : రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పిలుపునిచ్చారు. అన్ని దానలకన్నా రక్తదానం గొప్పదని ఈ విషయంలో యువత ముందుండాలని డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. కలెక్టర్ ప్రసన్న కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలు సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలు ఏర్పాటు చేసి రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేడ్కర్‌కి ఘనంగా నివాళులర్పిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో డీపీఓ పాల్గొని యువతను ఉద్దేశించి మాట్లాడుతూ అంబేడ్కర్ గొప్పతనాన్ని యువతకు వివరించారు. రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. 65 యూనిట్ల వరకు రక్తదానం చేసిన డ్వామా కార్యాలయం సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది, రామచంద్ర, ఏలూరు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులను డీపీఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రాము, జిల్లా వైద్యాశాఖ అధికారి డా. యం.నాగేశ్వరావు, డాక్టర్ వరప్రసాద్‌రావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి సీతారాం, పి.ఆర్.ఓ రమణ, డీపీయం పులి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఏపీ చేతివృత్తిదారుల 2024 వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య 2024 వార్షిక క్యాలెండర్‌ను ఏలూరు జిల్లా నాయకులు, సీపీఐ నాయకులు గురువారం ఆవిష్కరించారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు కడుపు కన్నయ్య, పొట్టేలు పెంటయ్య, పడాల సూరిబాబు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వృత్తిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా సహకారం అందించి వృత్తులను ప్రోత్సహించాలని కోరారు.

అలరించిన సంగీత, నృత్య ప్రదర్శనలు



అన్నమాచార్య కీర్తలను ఆలపిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన వివిధ సంగీత, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తెనాలికి చెందిన నోరి నారాయణ మూర్తి హనుమద్ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. నగరానికి చెందిన పోలిశెట్టి పృధ్వీసాయి తులసి, ఉషాలావణ్య నిర్వహించిన అన్నమాచార్య గానామృత సంగీత కార్యక్రమం అలరించింది. శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం ఆధ్వర్యంలో ప్రిన్స్‌పాల్ మేదరమెట్ల శిరీష శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో భోగి మంట వద్ద కోలాటమాడుతున్న విద్యార్థినులు



హరిదాసుకు దానం చేస్తూ



మెహెందీ పోటీ



డూ డూ బసవన్నతో సెల్ఫీ

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

- సీఆర్‌ఆర్‌లో విద్యార్థుల సందడి
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : చిన్నారులకు భోగి పండ్లు, భోగి మంటలు, బొమ్మల కొలువు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసు కీర్తనలు, రంగోలి, మెహెందీ పోటీ, హోంఫుడ్, గాలి పటాలు, సంప్రదాయ వస్త్ర ధారణ, జానపద, శాస్త్రీయ నృత్యాల ప్రదర్శనలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటేలా వైభవంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా గురువారం నిర్వహించిన ఈ వేడుకలకు నగరంలోని సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల ప్రాంగణం వేదికైంది. ఈ సంబరాలను విద్యా సంస్థల పాలక మండలి ఉపాధ్యక్షుడు వీవీ బాలకృష్ణారావు భోగి మంటలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఇన్‌చార్జి సెక్రటరీ కిలారు ప్రభాకరరావు, ట్రెజరర్ చిట్టూరి జానకి రామయ్య, అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఏస్ విష్ణుమోహన్, పీజీ కోర్సుల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, మహిళా కళాశాల కరస్పాండెంట్ పాలడుగు శ్రీరంగం విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



రంగవల్లుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కోడిపందేలు, జూదంపై నిఘా

- ఏలూరు సబ్ డివిజన్‌లో తనిఖీలు
- 673 మందిపై బైండోవర్
- 39 పేకాట కేసుల్లో 231 మంది అరెస్ట్
- కోడిపందేలు ఆడుతున్న 18 మందిపై కేసు
- ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారులు

ఏలూరు టౌన్: రాబోయే తెలుగు వెలుగుల సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజలంతా తమ ఊర్లలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల మధ్య సంతోషంగా జరుపుకుంటారు. కానీ సంప్రదాయాలకు విరుద్ధంగా అసాంఘిక కార్యకాపాలకు పాల్పడితే సహించేదిలేదని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి హెచ్చరిస్తున్నారు. కోడిపందేలు, పేకాట, జూదాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో చట్టాన్ని ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై

జిల్లాలోనూ, ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అటువంటి వారి సమాచారాన్ని తమకు అందించాలని పోలీస్ అధికారులు కోరుతున్నారు.

డయల్ 100 లేదా 112 లేదా వాట్సాప్ నంబర్ 83329 59175కు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) టోల్‌ఫ్రీ నంబర్ 14500 లేదా 073826 23669 సమాచారం ఇవ్వాలని కోరారు.

ఏలూరు పోలీస్ సబ్ డివిజన్‌లో

ఏలూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో పదిరోజుల్లో భారీగా పోలీస్ అధికారులతో తనిఖీలు, దాడులు చేశామని ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని, యువతను చెడుమార్గంలో నడిపించేలా జూదాన్ని ప్రోత్సహిస్తే సహించబోమని ఆయన స్పష్టం చేశారు.

కేసుల వివరాలు

673 మందిపై బైండోవర్ నమోదు చేశామని, 1,102 మందిని తహసీల్దార్ కోర్టులో పూచీకత్తుతో విడుదల చేశామన్నారు. 39 పేకాట కేసుల్లో 231 మందిని అదుపులోకి తీసుకుని రూ.4,39,950 నగదు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. 4 కోడిపందేల కేసుల్లో 18మందిని అదుపులోకి తీసుకుని రూ.11790 నగదు, 7 కోడి పుంజులు, 4 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ చెప్పారు. 70 అక్రమ మద్యం కేసుల్లో 70 మందిని అదుపులోకి తీసుకుని, 349 క్వార్టర్స్, 750 ఎంఎల్ బాటిళ్లు 2 స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రజలు మన సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలి. యువత, విద్యార్థులను, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చేటు తెచ్చేలా కోడిపందేలు, పేకాట, గుండాట వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ వంటి వాటిలో యువత పాల్గొనేలా చూడాలి. యువత, విద్యార్థులపై కేసులు నమోదైతే భవిష్యత్తులో విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్ట్, వీసాల్లోనూ, ఉన్నత ఉద్యోగావకాశాల్లోనూ ఇబ్బందులు ఏర్పడతాయి. కోడిపందేలు నిర్వహించేందుకు స్థలాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తాం.

– ఈ.శ్రీనివాసులు, ఏలూరు డీఎస్పీ

రెడ్‌క్రాస్ నర్సింగ్ కాలేజీలో సంబరాలు



ఏలూరు పత్తేబాద రెడ్‌క్రాస్ నర్సింగ్ కాలేజీలో భోగిమంట చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఏలూరు టౌన్: ఏలూరు పత్తేబాదలోని రెడ్‌క్రాస్ ఏఎన్ఎం నర్సింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు అత్యంత ఉత్సాహ వాతారణంలో సాగాయి. నర్సింగ్ కళాశాల విద్యార్థినుల తోపాటు, అధ్యాపకులు, యాజమాన్యం పాల్గొని వేడుకలు నిర్వహించారు. రంగవల్లులతో ప్రాంగణాన్ని అలంకరించి, భోగి మంటలు వెలిగించి దాని చుట్టూ తిరుగుతూ జానపద నృత్యాలు చేశారు. గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, కోలాటాలు, పిండి వంటల ప్రదర్శనలతో అలరించారు. విద్యార్థినిలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులుగా కళాశాల చైర్‌పర్సన్ బొమ్మారెడ్డి పద్మజవాణి, కమిటీ సభ్యులు ఆర్.కమల, వై.ఉమా వాణి, బి.జ్యోతి, పద్మజ హాజరై పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు జీ.జ్ఞానవేణి, ఏ.ప్రియాంక, సీహెచ్ అనూష, ఏ.సూర్యనారాయణ, ఎం.యశోద ఉన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలు



పోటీ పడుతున్న బ్యాడ్మింటన్ జట్లు





ఏలూరులో బ్యాడ్మింటన్ పోటీలకు హాజరైన క్రీడాకారులు, లంకపేట, ఎంఆర్‌సీ జట్ల మధ్య పోటీ ప్రారంభిస్తున్న పీఈటీలు

ఏలూరు రూరల్: ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. క్రీడాకారులు విజయం కోసం హోరాహోరీగా తలపడ్డారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సచివాలయ ఉద్యోగులు, వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలు నిర్వహించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 1 నుంచి 27వ సచివాలయం పరిధిలో ఆటల పోటీలు ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. 28 సచివాలయం నుంచి 54 సచివాలయం జట్లకు పోటీలు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించారు. లంకపేట 2 సచివాలయం కబడ్డీ జట్టుతో ఎంఆర్‌సీ కాలనీ సచివాలయం జట్టు తలపడింది. ఇందులో 29 పాయింట్లతో లంకపేట జట్టు విజయం సాధించింది. బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ పోటీల్లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏలూరు రూరల్ ఎంపీడీఓ బి ప్రణవి పర్యవేక్షణలో గ్రామాల్లో ఆటల పోటీలు గుడివాకలంకలో నిర్వహించారు. స్థానిక బీసీ కాలనీ ఆట స్థలం కొల్లేరు గ్రామాల సచివాలయ వాలీబాల్ జట్లు తలపడ్డాయి. మాదేపల్లి, చాటపర్రు జెడ్పీ పాఠశాలలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. నేడు జరగబోయే మ్యాచ్‌లు : ఇండోర్ స్టేడియంలో శుక్రవారం కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని అబ్జర్వర్ సెయింట్‌థెరిస్సా పీఈటీ మురళీకృష్ణ చెప్పారు. పురుషుల విభాగంలో ఉదయం గొల్లాయిగూడెం జట్టు, పోస్టల్ కాలనీ జట్టుతో తలపడనుందన్నారు. మరో మ్యాచ్‌లో అశోక్‌నగర్ జట్టుతో యరుకుల కాలనీ జట్టు పోటీ పడుతుంది. మహిళల విభాగంలో రామచంద్రరావుపేట జట్టుతో శాంతినగర్ జట్టు, అరుంధతి జట్టుతో గొల్లాయిగూడెం జట్టు తలపడుతుందన్నారు.

వ్యక్తిపై బీరు సీసాతో దాడి

ఏలూరు టౌన్: ఏలూరు అశోక్‌నగర్ ఏటిగట్టు ప్రాంతంలో క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఒక వ్యక్తిపై మరో వ్యక్తి మద్యం మత్తులో బీరుసీసాతో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక అశోక్ నగర్ ఏటిగట్టు ప్రాంతానికి చెందిన రంగబాబు క్యాటరింగ్ పనులు చేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన పుల్లారావు అనే వ్యక్తి రంగబాబు ఇంటి ముందు గురువారం వేరే వ్యక్తులతో గొడవకు దిగాడు. తన ఇంటి ముందు గొడవలు వద్దని రంగబాబు మందలించాడు. పుల్లారావు కాసేపటికి మద్యం తాగి వచ్చి బీరు సీసాతో రంగబాబుపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గాయాలపాలైన బాధితుడిని స్థానికులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వైద్యులు చికిత్స నందిస్తున్నారు.

హుండీ లెక్కింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు గురువారం హుండీలను లెక్కించారు. స్వామి వారికి హుండీల ద్వారా 100 రోజులకు రూ.57,785 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిననాగేశ్వరరావు తెలిపారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి డీ. శంకర రావు పర్యవేక్షించారు.

మద్యం సీసాల స్వాధీనం

భీమడోలు: పూళ్ల శివారు ఎంఎంపురంలో అక్రమంగా మద్యం సీసాలను నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్న మద్దాల ఏసుబాబును బుధవారం రాత్రి భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్దాల ఏసుబాబు మద్యం దుకాణం నుంచి నాలుగు క్వార్టర్ సీసాలను తెచ్చుకుని తన ఇంటి వద్ద అధిక ధరలకు విక్రయిస్తుండగా భీమడోలు హెచ్‌సీ డి.శ్రీనివాసరావు అదుపులోకి తీసుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వై.సుధాకర్ పేర్కొన్నారు.

అందరివాడు బీఆర్ అంబేడ్కర్



రాజ్యంగా పీఠిక ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): అందరివాడు, భారత రాజ్యాంగ కర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిస్తామంటూ మద్దతు తెలుపుతూ ప్రతిజ్ఞ చేస్తూ ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన ప్లెక్సీ బ్యానర్‌పై అధికారులు సంతకాలు చేశారు. సామాజిక సమత సంకల్ప కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్లెక్సీపై కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి. మేరీ ప్రశాంతి, జేసీ బి.లావణ్యవేణి తదితరులు సంతకాలు చేశారు. కార్యక్రమానికి హాజరైన వారందరూ ప్లెక్సీ బ్యానర్‌పై సంతకాలు చేశారు.





ఫ్లెక్సీ బ్యానర్‌పై సంతకాలు చేస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి



బీఆర్ అంబేడ్కర్ వేషధారణలో బాలుడు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	20

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	04
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	13
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	14
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్	22.15	4822	34
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు –తిరుపతి	16.00	4830	రద్దు